డిటెక్టివ్ స్టోరీ

# బీజాక్షరాలు

**వి.యస్.రావ్**

నిగనిగలాడుతున్న వంకీల జుత్తు. వెడల్పాటి నుదురు. నుదురు మీద నాగేటి చాళ్ళలా మూడు గీతలు. తీర్చిదిద్దినట్టున్న చక్కటి కనుబొమలు. వాటి కింద ఒక చక్కని ముక్కకు ఉండదగిన పెద్ద పెద్ద కళ్ళు. కళ్ళు ఒక దానితో ఒకటి ఢీకొని యుద్ధం చేయడానికి వీలు లేకుండా మధ్యన నిర్మించిన సరిహద్దు లాంటి పొడగాటి ముక్కు. పొగ చూరకుండా, తమ సహజ వర్ణాన్ని కాపాడుకున్న ఎర్రటి పెదవులు. పై పెదవి మీద– ఆ పెదవి పొడవును కొలుస్తున్న నల్లటి గీత లాంటి మీసం...మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే అతని విశాల నేత్రాల మీదికి తన చూపుల్ని ప్రసరించాడు డిటెక్టివ్ టెంపో. పలకరింపుగా చూస్తున్న ఆ కళ్ళల్లో ఇప్పుడు...ప్రాణం లేదు...

ఆ కళ్ళు నిరంజన్‌వి. నిరంజన్ నీటిపారుదల శాఖ ఉపకార్యాలయంలో సీనియర్ టైపిస్టు. చదువు పూర్తయ్యాక తనకు పని కల్పించి, ఇంతకాలం పోషించిన ఆఫీసు టైప్ రైటర్ ముందు కుర్చీలో కూచున్నాడు నిరంజన్– నిర్జీవంగా. నిరంజన్ దేహ పంజరంలోంచీ ప్రాణ పక్షి తప్పించుకుని ఎగిరి పోవడానికి దాడి చేసిన కత్తి అతడి హృదయ క్షేత్రం లోంచీ మొలుచుకొచ్చిన ఎర్రటి మొలకలా దర్శనమి స్తోంది. ఆత్మహంస నిష్క్రమించడానికి పరిచిన సన్నటి పొడుగాటి ఎర్ర తివాచీలా అతని చొక్కా మీద కిందికి సాగి గడ్డకట్టిన రక్తధార...

నిర్జీవ దర్పణాల్లా ఉన్న నిరంజన్ కళ్ళల్లోకి జాలిగా, సానుభూతిగా చూసి, బరువుగా నిట్టూర్చి, వెనక్కి తిరిగాడు డిటెక్టివ్ టెంపో. అంతసేపూ నిరంజన్ శవ్వాన పరిశీలనగా చూస్తున్న డిటెక్టివ్ టెంపోనే మౌనంగా చూస్తూ ఉండిపోయిన ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్, కళ్ళతోటే ప్రశ్నల్ని రువ్వుతున్నాడు.

''పృధ్వీ! శవాన్నీ, ఈ గదినీ డాక్టర్‌కీ, ఫొటో గ్రాఫర్‌కీ, వేలిముద్రల వ్యక్తికీ వదిలేయ్! ఇంజనీర్ గారి ఛాంబర్లో కూచో. ఆఫీసు సిబ్బందిని ఒక్కొ క్కర్నే విడివిడిగా ప్రశ్నించు....''

''టెంపో....నువ్వు...'' ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ ఏదో అడగబోయాడు.

''నేను.... తరవాత నిన్ను ప్రశ్నిస్తాను!'' డిటెక్టివ్ టెంపో సిగరెట్ పెట్టెను జేబులోంచీ తీస్తూ అన్నాడు.

''అది కాదు, గురూ....నువ్వు ఇప్పుడు....'' పృధ్వీరావ్ ప్రారంభించాడు.

''నేను ఇప్పుడు బుర్ర ఉపయోగిస్తాను! నువ్వు నోరు ఉపయోగించు పృధ్వీరావ్!'' టెంపో ఇన్స్‌పె క్టర్ కళ్ళల్లోకి చూస్తూ అన్నాడు.

''నీ మొదటి విక్టిమ్, చీఫ్ ఇంజనీర్! గానుగా డేయ్!''

అగ్గిపుల్ల మంటలోకి సిగరెట్‌ని గుచ్చుతున్న డిటెక్టివ్ టెంపోని చూస్తూ, పృధ్వీరావ్ బరువుగా నిట్టూర్చాడు...

***

''ఆఫీసులో అందరిదీ ఒకే మాట. నిరంజన్ మచ్చలేని చంద్రుడు. నీతి అతని ఊపిరి. నిజాయితీ రక్తం. అందరితోనూ కలుపుగోలుగా, స్నేహంగా ఉండే తత్వం. కోపతాపాలూ, ఆవేశకావేషాలూ లేని వాడు....'' పచార్లు చేస్తూ, సిగరెట్ పీలుస్తున్న డిటె క్టివ్ టెంపోని చూస్తూ వల్లెవేశాడు ఇన్స్‌పెక్టర్ పృధ్వీ రావ్. ''ఒక్క ముక్కలో చెప్పాలంటే, నిరంజన్ అజాత శత్రువు, గురూ!''

డిటెక్టివ్ టెంపో పచార్లు ఆపి, పృధ్వీరావ్‌ని చిరు నవ్వుతో చూశాడు. ''అది అతిశయోక్తి పృధ్వీ! నిరం జన్‌కి శత్రువులు– కనీసం శత్రువు ఉన్నాడు! అజాత శత్రువుకి అజ్ఞాత శత్రువు!''

''ఎవరు?'' పృధ్వీకంఠంలో ఆశ్చర్యం, ఆతృతా పెనవేసుకున్నాయి.

''హంతకుడు!'' టెంపో నవ్వుతూ అన్నాడు. ''సరే... పోస్ట్‌మార్టం రిపోర్ట్ ఏమంటోంది?''

''ఆగస్టు పదిహేడు సాయంత్రం అరగంట అటూ ఇటుగా ఆరుగంటలకి ప్రాణం పోయుం టుంది. కారణం గుండెలో లోతుగా, గునపంలా దిగిన కత్తి!''

''వేలి ముద్రలు....''

''కోటాను కోట్లు!'' పృధ్వీరావ్ అడ్డుతగుల్తూ అన్నాడు. ''ఏటి ఇసుక మీద బాతుల కాళ్ళ గుర్తు ల్లా–లెక్కలేనన్ని! వాటిలో హతుడివీ ఉన్నాయి!''

''కత్తి పిడి మీద?'' డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

''అదే చెప్పబోతున్నా....'' ఇన్స్‌పెక్టర్ పృధ్వీ రావ్ అన్నాడు. ''ఆ ఎర్రటి కత్తి పిడి మీద నిరంజన్ ఎడమచేతి వేళ్ళ ముద్రలున్నాయి.''

డిటెక్టివ్ టెంపో కనుబొమలు కదిలి మధ్యలో కలుసుకున్నాయి. ''హతుడి వేలి ముద్రలా!?''

''ఎస్! ఆ వేలి ముద్రలు నిరంజన్‌వి. ఆత్మహత్య అని చెప్తున్నాయనిపిస్తోంది.''

''పృధ్వీ... కత్తి పిడిదాకా, లోతుగా దూసుకు వెళ్ళింది గుండెలోకి! ఎడం చేత్తో అంత బలంగా కత్తి దిగేసుకోవడం...''

''అసాధ్యంకాదు, టెంపో! కొంత మందికి ఎడం చెయ్యి కుడి చేతికన్నా బలంగా ఉంటుందిగా!''

డిటెక్టివ్ టెంపో సిగరెట్ వెలిగించాడు. పొగ ఊదుతూ ఇన్స్‌పెక్టర్ వైపు తదేకంగా చూశాడు. ''పృధ్వీరావ్, టెలిఫోన్ అందుకో! నిరంజన్ ఆఫీసుకి కాంటాక్ట్ చేయ్! నిరంజన్‌ది ఎడమ చేతి వాటమో, కుడి చేతి వాటమో చిటికెలో తెలిసిపోతుంది.''

''ఎస్....'' అంటూ పృధ్వీరావ్ టెలిఫోన్ రిసీవర్ అందుకున్నాడు. టెంపో టేబుల్ ముందు నుండీ దూరంగా కిటికీ వైపు కదిలాడు. కిటికీలోంచీ సిగ రెట్ పొగ ఊదుతూ, కిందికి, రోడ్డు మీదికి చూశాడు. బస్సులు, ఆటోలు, బైక్‌లు, స్కూటర్లు అడ్డదిడ్డంగా, అల్లిబిల్లిగా పరుగెడుతున్నాయి. అతని మెదడులో ఆలోచనల్లాగా...

''గురూ!'' ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ కంఠం టెంపో బుర్రలోని ఆలోచనల ట్రాఫిక్‌కి సడెన్ బ్రేక్ వేసింది. టెంపో గిరుక్కున వెనక్కి తిరిగాడు.

''నిరంజన్ రైట్ హ్యాండర్!'' పృధ్వీరావ్ నిరు త్సాహంగా అన్నాడు.

''హంతకుడు పొరపాటుచేశాడు పృధ్వీరావ్!'' టెంపో టేబుల్ వైపు అడుగులేస్తూ అన్నాడు.

''ఏమిటది గురూ!''

''నిరంజన్ గుండెల్లో నిర్దాక్షిణ్యంగా, కర్కశంగా

కత్తి దిగేసిన దారుణ శూన్య క్షణాల్లో అతని గుండె వైపునున్న ఎడమ చేతి వేళ్ళను కత్తి పిడి మీద నొక్కి ఉంచాడు...''

''ఎందుకు?'' పృథ్వీరావ్ అమాయకంగా అడిగాడు.

''నిరంజన్‌ది ఆత్మహత్య అని 'నువ్వు' అనుకునేందుకు!'' టెంపో నవ్వాడు. ''ఆ భయానక క్షణాల్లో నిరంజన్‌ది కుడిచేతి వాటం అనే విషయాన్ని అతను మరిచిపోయాడు!''

ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ మౌనంగా తలపంకించాడు.

''పృథ్వీ! ఆగస్టు పదిహేడు సాయంత్రం నిరంజన్ ఆఫీసులో ఒంటరిగా ఎందుకున్నాడు?''

''మరిచిపోయాను. నిరంజన్ ఆగస్ట్ పదిహేనుకు ముందు వారం రోజులుసెలవులో ఉన్నాడు. పదిహేను స్వాతంత్ర్య దినోత్సవం, పదహారు ఆదివారం శలవులు!వారం రోజులుగా తన సీట్లో పేరుకుపోయిన టైపింగ్ పని పూర్తి చేస్తానన్నాడు, ఇంజనీర్‌తో.... తను వొంటరి పక్షి. గదికెళ్ళి చేసేదేమీలేదు..అలా ఓవర్ టైం వర్క్ చేస్తూ, ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా చూసుకోవడం అతనికి అలవాటేట.''

''పృథ్వీరావ్...ఆ 'ఓవర్‌టైం'లో అతను ఏమీ టైప్ చేయలేదు'' డిటెక్టివ్ టెంపో సాలోచనగా అన్నాడు.

''ఎవరు చెప్పారు?'' పృథ్వీరావ్ తటీమని అడిగాడు. ఆ అంశం గురించి తను ఎవ్వర్నీ ప్రశ్నించలేదు.

''నేనే...చెప్తున్నాను!''

''గురూ...''

''ఎలా చెప్పగలిగాను? మూడో కంటితో చూశానా? లేదు పృథ్వీ! రెండు కళ్ళతో చూశాను'' టెంపో నవ్వుతూ అన్నాడు. ''అతని టేబుల్ మీద టైప్ చేసిన పేపర్లూ లేవు. టైప్ రైటర్‌లో టైప్ చేస్తున్న పేపర్లు గానీ, టైప్ చేయడానికి సెట్ చేసిన పేపర్లు గానీ లేవు. అంటే, తను ఆఫీస్ అవర్స్ తర్వాత ఏ పని చేయాలనుకున్నాడో, ఆ పనిని నిరంజన్ చేయలేదన్నమాట.''

''అంటే.....''

''పృథ్వీరావ్! ఫింగర్ ప్రింట్ ఎక్స్‌పర్ట్ సహదేవ్‌తో మనం అర్జెంటుగా మాట్లాడాలి!''

***

''సహదేవ్, నిరంజన్ శవం ఉన్న గదిలో ఎవరెవరి వేలి ముద్రలున్నాయి?'' డిటెక్టివ్ టెంపో ప్రశ్నించాడు.

''లెక్కపెట్టలేనన్ని! అల్లిబిల్లిగా ఎన్నో ఉన్నాయి, టెంపో గారూ!''

''నిరంజన్ వేలి ముద్రలు?''

సహదేవ్ బుర్రను పేపర్ల మీదికి వాల్చాడు. ''తలుపు మీదా, లైట్ స్విచ్ మీదా, కుర్చీ మీదా, టేబుల్ మీదా, సొరుగు ముందు భాగంలో, కార్బన్ పేపర్స్ బాక్సు మీదా, టైప్‌రైటర్ మీదా.....''

''టైప్‌రైటర్ మీద ఎక్కడెక్కడున్నాయ్?'' టెంపో అడిగాడు.

''టైప్‌రైటర్ ఫ్రేమ్‌కి రెండు వైపులా, రెండు చేతుల వేళ్ళ ముద్రలున్నాయి. ఇంకా, సిలిండర్ని తిప్పే రెండు నాబ్స్ మీదా, పేపర్లను రిలీస్ చేసే లివర్ మీదా, పేపర్ లైన్ మార్చే సన్నటి రాడ్ మీదా, రిబ్బన్ ఇండికేటర్ మీదా ఉన్నాయి.'' సహదేవ్ జాబితా చూస్తూ అన్నాడు.

''అయితే, రోలర్ మధ్య పేపర్లు లేవు.''

''అంటే, నిరంజన్ ఏదీ టైప్ చేయలేదనే అర్థం!''

''చేయడానికి పూర్తిగా సన్నద్ధమయ్యాడు.'' టెంపో అన్నాడు. ''పేపర్స్ సెట్ చేశాడు. అందుకే కార్బన్ పేపర్ బాక్స్ మీదా, సిలిండర్ నాబ్స్ మీదా, మార్జిన్ సెట్టర్స్ మీదా నిరంజన్ వేలి ముద్రలున్నాయి.''

''టెంపో, సెట్ చేసిన పేపర్లు ఏమయ్యాయి?'' పృథ్వీరావ్ ప్రశ్నించాడు. సమాధానం కోసం ఎదురు చూడకుండా మళ్ళీ తానే అన్నాడు. ''నా అనుమానం ఏంటంటే, కుర్చీలో కూర్చుంటూ, ఊరికే ఆలోచిస్తూ, అతను యధాలాపంగా టైప్‌రైటర్ని అక్కడా ఇక్కడా ముట్టుకున్నాడు. ఎలాగంటే హార్మోనియం ముందు కూచున్న హార్మోనిస్టు వాయించకపోయినా, అసంకల్పితంగా– అలవాటు ఆపుకోలేక హార్మోనియం రీడ్సుని ముట్టుకున్నట్టు!''


డిటెక్టివ్ టెంపో అతన్ని తదేకంగా చూశాడు.

''పృథ్వీరావ్ ఒక మంచి మాట అన్నావు! హార్మోనిస్ట్ వేళ్ళు రీడ్సు మీద, టైపిస్ట్ వేళ్ళు టైప్ రైటర్ కీస్ మీద!''

టెంపో గిరుక్కున సహదేవ్ వైపు తిరిగాడు. ''సహదేవ్! నువ్వు పూర్తిగా చెప్పలేదు.''

''సారీ సార్! టైప్‌రైటర్ కీస్ మీద కూడా హతుడి వేలిముద్రలున్నాయి...''

''మనక్కావల్సింది హతుడి వేలిముద్రలు కాదు, హంతకుడి వేలి ముద్రలు!'' ఇన్స్‌పెక్టర్ పృథ్వీరావ్ అన్నాడు.



''పృథ్వీరావ్! నిరంజన్ ఏదో టైప్ చేశాడు. అది హంతకుడికి ఇష్టం లేదు. అందుకే కాగితాలు లాగేసుకున్నాడు. నిరంజన్ గుండెలో కత్తిదిగేశాడు. నిరంజన్ ఏదో రహస్యాన్ని వెల్లడిచేసే విషయం టైప్ చేసి ఉండొచ్చు! అందరూ వెళ్ళిపోయాక, ఒంటరిగా రాత్రి ఆఫీసులో ఉండిపోవడం ఆ అనుమానాన్ని బలపరుస్తోంది.''

''టెంపోగారూ...ఒక్కక్షణం....'' సహదేవ్

అన్నాడు. ''నిరంజన్ ఏదో టైప్ చేశాడని అనుకోడానికి వీల్లేదు. ఎందుకంటే అతని వేలి ముద్రలు టైప్ రైటర్‌లోని 'ఐదు' కీస్ మీద మాత్రమే ఉన్నాయి.''

''వాట్! ఓన్లీ ఫైవ్ కీస్?'' టెంపో ఆశ్చర్యంగా అన్నాడు.

''నేను చెప్తూనే ఉన్నాగా గురూ! హతుడు నిరంజన్ ఏదీ టైప్ చేయలేదు'' ఇన్స్‌పెక్టర్ ఉత్సాహంగా అన్నాడు.

''సహదేవ్! నిరంజన్ ఫింగర్ ప్రింట్సున్న ఐదు కీస్ ఏవో చెప్పు!'' టెంపో, పృధ్వీరావ్ మాటల్ని పట్టించుకోకుండా అన్నాడు.

''టైప్ రైటర్ కీ బోర్డులో పై వరసని ఒకటవ వరసగా అనుకుంటే– ఆ వరసలో ఉండే 'యు' అనే అక్షరం మీదా, 'ఓ' అక్షరం మీదా, రెండవ వరసలో 'ఎస్' మీదా, మూడో వరసలో 'ఎన్' మీద, 'ఎమ్' మీదా ఉన్నాయి....''

"u,o,s,n,m..." టెంపో సాలోచనగా అన్నాడు.

''టెంపోగారూ, మరో విషయం...'' సహదేవ్ అన్నాడు.

''అయిదక్షరాలున్న ఆ ఐదు కీస్ మీదా ఉంది నిరంజన్ కుడిచేతి చూపుడు వేలిముద్రలే!''

డిటెక్టివ్ టెంపో సిగరెట్ ముట్టించి, ఘాటుగా పొగ పీల్చాడు. సహదేవ్ కళ్ళల్లోకి రెప్పవేయకుండా చూశాడు.

''కుడిచేతి చూపుడు వేలి ముద్ర...అయిదు అక్షరాల మీదా.... ఇంటరెస్టింగ్!''

''గురూ... మళ్ళీ చెప్తున్నా! నిరంజన్ ఏదీ టైప్ చేయలేదు. ఆ కోణం వదిలేసి, మరో కోణంలో ఆలోచించాలి మనం.'' పృధ్వీరావ్ అన్నాడు.

''మరో కోణం నువ్వు ఆలోచించు పృధ్వీ! నేను ఈ కోణంలోనే ఆలోచిస్తాను!'' డిటెక్టివ్ టెంపో నిష్కర్షగా అన్నాడు.

పృధ్వీరావ్ గుటకలు మింగుతూ చూశాడు.

''హతుడు నిరంజన్ అయిదు టైప్‌రైటర్ కీస్‌నీ ఒకే ఒక వేలితో స్పృశించడం ద్వారా లోకానికి ఏదో సందేశం ఇస్తున్నాడేమో అన్న ఆలోచన నీకెందుకు రావడం లేదు పృధ్వీరావ్?''


''టెంపో...''

''ఎస్! డోంట్ ఇగ్నోర్ ఫ్యాక్ట్స్!'' టెంపో గంభీరంగా అన్నాడు.

''నిరంజన్ ఏదో టైప్ చేయడానికి పేపర్స్‌సెట్ చేశాడు. వివిధ భాగాల మీద కొలువు తీరిన అతని వేలిముద్రలు ఆ విషయం చెప్తున్నాయి. టైప్ చేయబోయే విషయాన్ని లోపల్లోపల రూపొందించుకుంటూ, పేపర్లూ, కార్బన్లూ సెట్ చేసిన నిరంజన్– మొట్టమొదట చేయాల్సిన పని చేయలేదు.''

''ఏమిటది?'' పృధ్వీరావ్ కుతూహలంగా అడిగాడు.

''దుమ్మూ, ధూళీ పేరుకుపోయిన టైప్ రైటర్ని



తుడవడం!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

''అందుకే వేలి ముద్రలు అతి స్పష్టంగా ఉన్నాయి'' సహదేవ్ అన్నాడు.

''నిరంజన్ ఏదో టైప్ చేశాడు. అయితే అది కాగితాన్ని అందుకోలేదు. ఎందుకంటే అప్పుడు టైప్ మిషన్‌లో కాగితం లేదు. నా ఊహ ప్రకారం, సెట్ చేయబడిన పేపర్స్‌ని హంతకుడు కసిగా లాగేసు



## మీరే డిటెక్టివ్!?

నిర్వహణ: అన్య

### డాగ్ స్క్వాడ్

కొండ శిఖరం మీద మంచులో పడివుంది మృతదేహం.

''ఎన్నాళ్ళైందో మరణించి?'' అంటూ సందేహం వ్యక్తం చేశాడు డిటెక్టివ్.

''ఆరు రోజుల క్రితం జరిగింది ప్రమాదం. మంచు తుపాను కారణంగా రాలేకపోయాం. ఇతను కొన్ని వాతావరణ ప్రయోగాలు చెయ్యటానికి వచ్చాడు. అదిగో, ఆర్నెల్లుగా ఆ కేబిన్‌లో వుంటున్నాడని తెలిసింది'' అన్నాడు ఇన్‌స్పెక్టర్.

మూడు రకాల అడుగు జాడలు మంచులో స్పష్టంగా కనిపించాయి. ఒకటి డిటెక్టివ్‌ది. మరొకటి ఇన్‌స్పెక్టర్‌ది. మృతునికి ఆహారం సప్లై చెయ్యటానికి అతని అసిస్టెంట్ వారానికోసారి వచ్చేవాడు. మూడో అడుగుజాడ అతనిదే. ఇవి కాక ఒక కుక్క నడిచిన గుర్తులు కూడా వున్నాయి.

''తోడుగా వుంటుందని ఒక జాగిలాన్ని (జర్మన్ షెపర్డ్ జాతి) పెంచుకున్నాడు. అదే యింత పని చేసింది. ఎందుక్కోపమొచ్చిందో, అతని మెడ కొరికేసింది. కండ వూడి వచ్చింది. అదిగో, గాయం'' అన్నాడు ఇన్‌స్పెక్టరు సాలోచనగా.

అంతలో జాగిలం అటుగా వచ్చి అడుగుజాడల్ని వాసన చూస్తూ అటూ ఇటూ తిరిగింది. మూడడుగుల ఎత్తూ, అయిదడుగులు పొడుగూ ఉందది.

''అదిగో, అదే యింత పనిచేసింది''

''అవును. బలమైన జాగిలమే! కోపమొస్తే దాన్ని కంట్రోల్ చెయ్యలేం. కాని యితడు మరణించి ఆరు రోజులు కాలేదు. అది అబద్ధం గనక, కుక్కవలన మృత్యువు సంభవించలేదని కూడా చెప్పవచ్చు'' అన్నాడు డిటెక్టివ్.

అతనికెందుకా అనుమానం వచ్చింది?

[illegible]

కుని ఉంటాడు. అయితే,నిరంజన్ టైప్ చేసిన 'సందేశం' మరొక చోట ప్రింట్ అయ్యింది...'' టెంపో సాలోచనగా అన్నాడు.

''ఎక్కడా?'' పృధ్వీరావ్ ఆశ్చర్యంగా అడిగాడు.

''టైప్ రైటర్ కీస్ మీద''

పృధ్వీరావు,సహదేవ్ ఆశ్చర్యంగా చూశారు.

''ఎస్, పృధ్వీ! ప్రాణాలు వదిలే ముందు నిరంజన్ తన చూపుడు వేలితో ఐదు అక్షరాలు నొక్కి, ధూళి మీద గుర్తుపడేలా చేసి- తాను చెప్పదలచుకుంది వ్యక్తం చేశాడు.''

''ఏమిటది? తను ఏం చెప్పాలనుకున్నాడు?''

''తనను పొడిచిన వ్యక్తి పేరు!''

''టెంపో...''

''ఎస్! మనిషి చనిపోయే ముందు బుర్ర ఒక్క వెలుగు వెలుగుతుందంటారు! దాన్నే 'చావు తెలివి' అంటారు. నిరంజన్ 'చావు తెలివిగా' తన గుండెల్లో కత్తి నాటిన కసాయి పేరు సూచిస్తూ, అక్షరాల్ని ముట్టుకున్నాడు, పృధ్వీరావ్!''

"UOSNM అనే అక్షరాలా? వాటికి తలా తోకా లేదు. ఆ అక్షరాల్లో పేరూ లేదు. ఊరూ లేదు.''

''తలా తోకా లేకుండా కనిపిస్తున్న ఆ అక్షరాల్ని అర్థం వచ్చే క్రమంలో జోడించు!'' టెంపో గంభీరంగా అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ నిట్టూర్చాడు! ఏదో చెప్పబోతూ నోరు తెరిచాడు.

''పృధ్వీరావ్! పెర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్ అనే వాటిని ఎప్పుడైనా విన్నావా?'' డిటెక్టివ్ టెంపో ఉన్నట్టుండి ప్రశ్నించాడు.

''పెర్మ్యుటేషన్స్ అండ్ కాంబినేషన్స్....'' పృధ్వీరావ్ సాలోచనగా అన్నాడు. ''చిన్నప్పుడు చదువుకునే రోజుల్లో... అర్థం చేసుకోకుండా విన్నట్టు గుర్తుంది!''

''అంటే- అక్షరాల్నీ, అంకెల్నీ వరస క్రమం మారుస్తూ- అటూ, ఇటూ చేస్తూ కూర్చడం. నిరంజన్ సప్లై చేసిన UOSNM అనే అయిదక్షరాల్నీ అలా మార్చి, కూర్చి చూడాలి. అలా కొత్తగా రూపొందే పదాల్లో హంతకుడి పేరుంటుందేమో....''

''గురూ...'' పృధ్వీరావ్ ఏదో అడిగే ప్రయత్నంలో అన్నాడు.

''ఎందుకంటే నిరంజన్ టైప్ చేసిన క్రమంలో కాకుండా, పై వరస నుండీ కింది వరస దాకా- మనం ఆ అక్షరాల్ని తీసుకున్న క్రమంలో చదువుతున్నాం! నిరంజన్, ఏదో పేరును సూచించే కీస్‌ని టచ్ చేసి ఉంటాడు. అయితే ఆ క్రమం- ఆ ఆర్డర్ ఏదో మనకు తెలీదు. అంచేత ఆ అయిదు అక్షరాల్తో కొత్త కొత్త వరసల్లో పదాలు రూపొందించాలి. ఎన్ని పదాలొస్తాయో తెలుసా?'' టెంపో అన్నాడు.

పృధ్వీరావ్ తల అడ్డంగా ఊపాడు, నీరసంగా.

''అక్షరాలు ఐదు. ఐదు X నాలుగు X మూడు+రెండూ+ఒకటి= అనే ప్రకారం 'నూట ఇరవై' గ్రూపులొస్తాయి. వాటిలో హంతకుడి పేరు దాక్కొని ఉంటుంది!'' టెంపో ఉత్సాహంగా అన్నాడు.

ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ లెక్కల మాస్టార్ని చూస్తున్న మొద్దు విద్యార్థిలా టెంపో ముఖంలోకి చూశాడు. ''గురూ...అర్థం కాలేదు...''

''ఓకే పృధ్వీరావ్! లెక్కల్లో లెసన్ చెప్తాను. 'xyz' అనే అక్షరాలు, అంకెలు, వస్తువులు- ఏవైనా సరే- ఉన్నాయనుకో. వాటిని అటూ, ఇటూ మార్చి కొత్త కాంబినేషన్స్‌లో అరెంజ్ చేయాలి. అవి మూడు కాబట్టి 3x2x1=అంటే- ఆరు గ్రూప్స్ చేయొచ్చు. ఎలాగంటే- xyz, xzy, yxz. yzx, zxy, zyx....

''కొరుకుడు పడుతోంది...'' పృధ్వీరావ్ టేబుల్ సొరుగులోంచీ తెల్ల కాగితాల్ని వెలికి తీస్తూ అన్నాడు.

***

''మొత్తం కొత్త పదాలు నూటిరవై... వాటిలో పలకడానికి వీల్లేనివీ, అర్థం పర్థం లేనివీ నూట పంధొమ్మిది'' టెంపో తను రాసిన పేపర్లో చూస్తూ అన్నాడు.

పదాల తయారీలో కుస్తీ పడుతూనే ఉన్న ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్, సహదేవ్-ఇద్దరూ కుస్తీ ఆపేసి, తేలిగ్గా నిట్టూర్చి, టెంపో వైపు చూశారు.

''ఒక మోస్తరుగా-కొంచెం అర్థవంతంగా ఉన్న పద బంధం ఒక్కటే ఒక్కటి! అది "SONUM'- 'సోనుమ్' కావచ్చు. 'సోనమ్' కావచ్చు!'' టెంపో వివరిస్తూ అన్నాడు. ''పృధ్వీ నిరంజన్ సహ ఉద్యోగుల్లో ఆ పేరున్న వ్యక్తి ఉన్నారేమో చూడు.''

''ఆ పేరున్న వాళ్ళు ఎవ్వరూ లేరు!'' ఫైల్లో ఉన్న జాబితా చూస్తూ అన్నాడు పృధ్వీరావ్.

టెంపో కుర్చీలోంచీ లేచాడు. కోటు జేబుల్లో చేతులు దోపుకుని, పచార్లు ప్రారంభించాడు. అర్థం పర్థం లేని అక్షరాలతో నిరంజన్ ఏం చెప్తున్నాడు? తన ఊహ సరైందేనా? నిరంజన్ నిజంగానే ఏదేనా సందేశం అందిస్తున్నాడా? ఆలోచనలు టెంపో నుదురు మీద గీతలు గీస్తున్నాయి. పృధ్వీరావ్ ఏదో అడిగాడు. టెంపోని ఉద్దేశించి అతను అడిగిన ప్రశ్న గోడను తాకిన బంతిలా అతని వైపే వెనక్కి దూసుకెళ్లింది. టెంపో తటాలున ఆగాడు.

''పృధ్వీరావ్... నిరంజన్ ఒక్కొక్క అక్షరాన్ని ఒక్కోసారి తాకాడు...''

''గురూ. మనం దారి తప్పాం. ఒక్కసారి కాదు, వందసార్లు అతను ఆ అక్షరాల్ని ముట్టుకున్నా-లాభం లేదు. మన పరిశోధన కొత్త పుంతలు తొక్కాలి!''

''ఒక్క సారి కాదు...వందసార్లు...'' ఇన్స్‌పెక్టర్ పృధ్వీరావ్ అన్న మాట టెంపో లోపల ప్రతిధ్వనిస్తోంది. అని రెండు చేతులూ కోటు జేబుల్లోంచీ ఇవతలకి వచ్చాయి. వేళ్ళు అసంకల్పితంగా లాక్కొచ్చిన సిగరెట్ పెట్టినీ, అగ్గిపెట్టెని ఆశ్చర్యంగా చూస్తూ, సిగరెట్ ముట్టించాడు. టెంపో ఒక్కసారి పొగ లాగి, తీక్షణంగా చూశాడు.

''పృధ్వీరావ్! నిరంజన్ ఒక్కో అక్షరాన్ని ఒక్కోసారే తాకేడని ఎందుకనుకుంటున్నాం?''

''నువ్వే అన్నావు! నువ్వే చెప్పాలి, ఎందుకో!''

''సహదేవ్! నిరంజన్ కొన్నింటిని రెండేసి సార్లు టచ్ చేసి ఉండొచ్చా?''

''ఉండొచ్చు, సార్!'' సహదేవ్ అన్నాడు.

''కొన్నింటిని ఒకటి కన్నా ఎక్కువసార్లు అతను

టచ్ చేసి ఉంటే అర్థవంతమైన పదాలు పుట్టుకొస్తాయి...'' టెంపో అప్రయత్నంగా టేబుల్ ముందు కూచున్నాడు. కాగితాల్ని ముందుకు లాగి, ఇందాకా టేబుల్ మీద పడేసిన పెన్ అందుకొన్నాడు.

టెంపో చకచకా రాసుకుపోతున్నాడు. నిమిషాలు దొర్లుతున్నాయి. సిగరెట్ పొగ టెంపో తల మీద మేఘంలా వేళ్ళాడుతోంది. పృధ్వీరావ్ అసహనంగా కదుల్తున్నాడు. సహదేవ్ ఆవులింతల్ని ఆపుకోలేక సతమతమవుతున్నాడు.

అరగంట గడిచాక, టెంపో రాయడం ఆపి, పృధ్వీరావ్ వైపు తలెత్తి చూశాడు. ''పని సులువు కావడానికి- మనకున్న అయిదక్షరాల్లో కొన్నింటిని ఒకటి కన్నా ఎక్కువ సార్లు వాడుతూ-పలకగలిగిన పదాలు కొన్ని రాశాను. వాటిల్లో అర్థవంతమైనవి కొన్ని ఉన్నాయి. ఆ కొన్నింటిలో ఒక్కటి నా దృష్టిని అయస్కాంతంలా లాగుతోంది.''

''ఏమిటది?'' పృధ్వీరావ్ ఉత్కంఠంతో అడిగాడు.

"UOSNM అనే అక్షరాల్లో 'ఎన్' ని రెండు సార్లూ, 'ఒ'ని రెండు సార్లూ ఉపయోగించాను. రెండు అర్థవంతమైన పదాల్ని సృష్టించాను.'' టెంపో వివరిస్తూ అన్నాడు. ''ఒకటి, SUN -సన్, రెండు, MOON మూన్...''

''అంటూ, సూర్యుడూ, చంద్రుడూ?'' పృధ్వీరావ్ తపీమని అన్నాడు.

''కంగ్రాట్స్, పృధ్వీ! కరెక్టుగా ఊహించావ్!'' టెంపో నవ్వుతూ అన్నాడు. సూర్య చంద్రుల పేర్లు ధ్వనించే పేరేదైనా సిబ్బంది లిస్టులో ఉందేమో చూడు!''

పృధ్వీరావ్ ఆవేశంగా ఫైల్‌ని ముందుకు లాగాడు. అతని చూపులు పేపరు మీద పరుగు తీస్తున్నాయి. పృధ్వీరావ్ తల మెల్లిగా పైకి లేచింది.

''అలాంటి పేరులేదు....'' అన్నాడతను నిరుత్సాహంగా.

''వాట్?'' డిటెక్టివ్ టెంపో అరిచాడు, ఆశ్చర్యంతో.

''ఎస్, టెంపో! సూర్యచంద్ర పేరు లేదు...''

''మైడియర్ పృధ్వీ రావ్! నీకు 'అమరకోశం' తెలుసా?'' టెంపో చిరునవ్వుతో ప్రశ్నించాడు.

''గురూ...'' పృధ్వీరావ్ దీనంగా అన్నాడు.

''సూర్యుడికీ, చంద్రుడికీ ఉండే చాలా పేర్లనీ అమరకోశంలో గ్రంథకర్త అమరసింహుడు నిక్షిప్తం చేశాడు. సూర్యుడు, భానుడు, భాస్కరుడు, ఇనుడు వగైరా పేర్లు సూర్యుడివి. ఇంద్రుడు, చంద్రుడు, శశాహరు వగైరా చంద్రుడివి. ఒక పని చేయ్! ఆ జాబితాలో ఉన్న సిబ్బంది పేర్లన్నీ చదువు!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

పృధ్వీరావ్ ఓపిగ్గా పదహారు పేర్లు చదివి, 'చూశావా?' అన్నట్టు టెంపో వైపు చూశాడు.

''మొట్టమొదటి పేరు... చీఫ్ ఇంజినీర్ పేరేమిటన్నావ్?'' టెంపో సాలోచనగా అన్నాడు.

''బిఎస్. వర్మ...''

''పూర్తి పేరు కావాలి నాకు!''

పృధ్వీరావ్ టెలిఫోన్ రిసీవర్ అందుకొన్నాడు. అతన్ని మరిచిపోతూ టెంపో సిగరెట్ వెలిగించి, పచార్లు ప్రారంభించాడు.

''గురూ.....'' పృధ్వీరావ్ కంఠంలో ఆవేశం పలికింది.

టెంపో పచార్లు ఆపి, అతని ముందు నిలబడి ప్రశ్నార్థకంగా చూశాడు.

''ఎస్!''

''అతని పేరు...అదే పూర్తి పేరు, భాస్కర శశాంక వర్మ!''

''పృధ్వీరావ్! నిరంజన్‌కి ధన్యవాదాలు చెప్పుకో! 'సన్-మూన్' అనే పదాలు టైప్ చేసి, తన హంతకుణ్ణి నీకు పట్టిస్తున్నాడతను!''

''టెంపో!''

''ఎస్! నిరంజన్ నిజంగా మేధావి. భాస్కర శశాంక పేరును 'సన్-మూన్' అనే బీజాక్షరాలలో సూచించాడు.'' డిటెక్టివ్ టెంపో ఉత్సాహంతో అన్నాడు.

''గురూ... నిరూపించడం ఎలా?'' పృధ్వీరావ్ దిగాలుగా అన్నాడు.

టెంపో ఆలోచిస్తూ, సిగరెట్ పీకని గది మూలకి విసిరాడు. గీతలుగా తయారైన నుదుర్ని అరచేత్తో రుద్దుకున్నాడు. తటాలున పృధ్వీరావ్‌వైపు తిరిగాడు. 'పృధ్వీరావ్, మందీ మార్బలంతో బయల్దేరు! చీఫ్ ఇంజనీర్ బి.ఎస్. వర్మ-భాస్కర శశాంక వర్మ కాకుంటే 'సన్‌మూన్ వర్మ' ఇల్లుండే వీధిలో చాటుగా మాటువేయ్! ఏ విదేశానికో ఎగిరిపోడానికి ఆదరాబాదరా బయల్దేరుతాడు. బేడీలు తగిలించి, లాక్కెళ్ళు...?''

''గురూ... నిరంజన్ని అతను ఎందుకు చంపాడో చెప్పగలవా?'' పృధ్వీరావ్ అడిగాడు.

''చెప్పలేను! చెప్పకూడదు! వర్మను కుర్చీకి కట్టేయ్! నీ పద్ధతిలో గానుగ ఆడేయ్! చమురు కక్కేస్తాడు. ఎందుకు చంపాడో విని, నాకు వినిపించు!'' టెంపో నవ్వుతూ అన్నాడు. ''పలాయనం నేరాన్ని అంగీకరించడమే!''

''గురూ! మరోలా అనుకోవద్దు! వర్మ ఉన్నట్టుండి ఎందుకు పారిపోతాడు?''

''ఒక వ్యక్తి వర్మకి ఉప్పు అందిస్తాడు. నిరంజన్ని చంపింది నువ్వే అని తెలిపోయిందనీ, అరెస్టు చేయడానికి ఇన్స్పెక్టర్ పృధ్వీరావ్ బయలుదేరుతున్నాడనీ, కృషి వెంకటేశ్వరరావు ఆదర్శంగా తీసుకొని ఏ విదేశాలకో ఎగిరిపొమ్మనీ సలహా ఇస్తాడు...'' గుసగుసగా... కంఠం మార్చి... ''ఎవరా వ్యక్తి?''

''డిటెక్టివ్ టెంపో!'' టెంపో నవ్వుతూ అన్నాడు.

ఇన్స్పెక్టర్ పృధ్వీరావ్ వీరావేశంతో కుర్చీలోంచీ లేచాడు.

***

''దిల్ కి ఆవాజ్ భీ సున్!'' ఓపి నయ్యర్ పాటను రింగ్ టోన్‌గా వినిపిస్తున్న తన మొబైల్ ఫోన్‌ని కోటు జేబులోంచీ తీశాడు డిటెక్టివ్ టెంపో. ''ఎస్ పృధ్వీ...''

''గురూ! కంగ్రాట్స్! నువ్వు చెప్పిందంతా నిజమే! వర్మ నేరం అంగీకరించేశాడు'' పృధ్వీరావ్ కంఠంలో ఉద్రేకం.

''ఎందుకు హత్య చేశాడు?''

''తెలుగు గంగ, కన్నడ గంగతో కలిసి, 'తమిళ గంగ'గా మార్చే స్కాట్‌లో పోయిన ఏడాది జరిగిన భారీ కుంభకోణం! ఆలస్యంగా దాన్ని పసిగట్టిన 'నిజాయితీ నిరంజన్' మినిస్టర్ని కలిసి అంతా చెప్పేశాడు. పూర్తి వివరాల్తో స్టేట్‌మెంటిమ్మన్నాడు మినిస్టర్. మినిస్టర్ పేషీలో 'బల్లి' వర్మ చెవిలో పలికింది. నిరంజన్‌నీ, అతన్తో పాటే ఆ భారీ రహస్యాన్నీ చంపాలనుకున్నాడు వర్మ! చంపాననే అనుకున్నాడు కూడా''పృధ్వీరావ్ నవ్వుతూ అన్నాడు. ''అయితే, నీ ముందు అతని మంత్రం పనిచేయలేదు!''

''నా ముందుకాదు. నిరంజన్ బీజాక్షరాల ముందు!'' డిటెక్టివ్ టెంపో నవ్వుతూ సరిదిద్దాడు.

*



## బిపాసా 'ఫిట్‌నెస్' వ్యాపారం...

సినిమాలు కాకుండా లాభసాటి వ్యాపారం కోసం వెతికిన బాలీవుడ్ సెక్సీబాంబ్ బిపాసా కళ్ళకు 'ఫిట్‌నెస్' వ్యాపారం కనపడింది. గతంలో శిల్పాశెట్టి యోగా పాఠాలు చెప్పి ఎంత పాపులర్ అయ్యిందో గుర్తుకు వచ్చి తాను కూడా 'ఫిట్‌నెస్' పాఠాలు చెప్పాలన్న నిర్ణయానికి వచ్చేసింది. ఆలోచన వచ్చిన వెంటనే దీనికి సంబంధించి మార్కెటింగ్ వ్యవహారాలూ, డిమాండ్ ఇతర వివరాలు ఆరా తీయమని తన ప్రియుడు జాన్ అబ్రహాంకి పురమాయించింది. పాపం అతగాడు ఆ పనిలో పడగానే, తాను ఫిట్‌నెస్ గురించిన విషయ సేకరణ పనిలో పడింది. అయితే శిల్పాశెట్టికి, బిపాసాకి చిన్న తేడా ఉందని బాలీవుడ్ పరిశీలకులు అంటున్నారు. శిల్పాశెట్టి యోగా పాఠాలు సంప్రదాయ బద్ధంగా ఉంటే, బిపాసా 'ఫిట్‌నెస్' క్లాసులు హాట్ హాట్‌గా ఉంటాయని అంటున్నారు. సినిమాలు లేకనే 'ఫిట్‌నెస్'వైపు దృష్టి సారించిందన్న విమర్శలు కూడా లేకపోలేదు.